
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 32.0 కనిష్ఠం : 23.0
1
వనపర్తి
జిల్లా వార్తలు
శనివారం 12 అక్టోబరు 2024







అలంపూర్, అచ్చంపేటలలో సిద్ధిదాత్రి దేవిగా దర్శనమిస్తున్న జోగుళాంబ, భ్రమరాంబ అమ్మవార్లు

సిద్ధిదాత్రి దేవిగా దర్శనం

అలంపూర్/అచ్చంపేట అర్బన్, అక్టోబరు 11: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అలంపూర్‌లోని జోగుళాంబ, ఉమామహేశ్వర క్షేత్రంలోని భ్రమరాంబ అమ్మవార్లు తొమ్మిదో రోజు శుక్రవారం సిద్ధిదాత్రి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలంపూర్‌లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దసరా సెలవుల నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలొచ్చారు. ఉమామహేశ్వర క్షేత్రంలో ఉమామహేశ్వరుడిని, భ్రమరాంబ అమ్మవారిని దర్శించుకున్నారు.




నేడు కొండారెడ్డిపల్లికి సీఎం రేవంత్‌రెడ్డి

- స్వగ్రామంలో దసరా పండుగ జరుపుకోనున్న ముఖ్యమంత్రి
- గ్రామ పంచాయతీ భవనం, గ్రంథాలయం,ఆధునిక రైతువేదిక ప్రారంభం

నాగర్‌కర్నూల్/వంగూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి శనివారం తన స్వగ్రామం నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లికి రానున్నారు. అక్కడే కుటుంబ సభ్యులతో కలిసి దసరా వేడుకలను జరుపుకోనున్నారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. రేవంత్‌రెడ్డి సీఎం హోదాలో తొలిసారి స్వగ్రామానికి వస్తుండటంతో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వివిధ శాఖల ఉన్నతాధికారులను ఆయా విభాగాలకు ఇన్‌చార్జిలుగా నియమించారు. గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనంతోపాటు గ్రంథాలయం, సోలార్ పైలెట్ ప్రాజెక్టు, ఆధునిక రైతువేదికను సీఎం ప్రారంభించనున్నారు. ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే వంశీకృష్ణ శుక్రవారం రాత్రి కొండారెడ్డిపల్లిలో బస చేసి, సీఎం పర్యటన విజయవంతమయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. సీఎం రాక సందర్భంగా సీఎం భద్రత అధికారి, అదనపు ఎస్పీ లక్ష్మీకాంతరావు, ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్‌లతో కలిసి కలెక్టర్ బదావత్ సంతోష్ హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కొండారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ భవనంలో సీఎం భద్రత సిబ్బంది, ఎస్పీ, అదనపు కలెక్టర్ దేవసహాయం, అధికారులతో సమీక్ష చేశారు. సీఎం పర్యటన నేపథ్యంలో ప్రతీ విభాగానికి ఒక అధికారిని నియమిస్తూ, ఏర్పాట్లను పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. సీఎం తిరిగి వెళ్లే వరకు అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. వంగూరు గేట్ వద్ద గల ఓ ఫంక్షన్ హాల్‌లో భద్రతా సిబ్బందితో సీఎం భద్రత అధికారి లక్ష్మీకాంతరావు సమావేశమై సూచనలు చేశారు.


కొండారెడ్డిపల్లిలో సీఎం పర్యటన ఏర్పాట్లను సమీక్షిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్







మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

మదనాపురం, అక్టోబరు 11: మహిళా సంఘాల సభ్యులు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మహిళా శక్తి క్యాంటీన్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా క్యాంటీన్ యజమానులతో రోజు ఎంత నడుస్తుందని అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి రోగుల రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య తక్కువ ఉందని.. పెంచే విధంగా చూడాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. గర్భిణులతో మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. డీపీఎం అరుణ, ఏపీఎం కృష్ణవేణి, అకౌంటెంట్ ప్రవళిక, సీసీ దయానంద్, మెడికల్ ఆఫీసర్ డా.భవాని కలెక్టర్ వెంట ఉన్నారు.





మార్కెట్‌కు పండుగ శోభ

- నేడు దసరా



కస్టమర్లతో కళకళలాడుతున్న వస్త్ర దుకాణం


జిల్లా కేంద్రంలో బస్సు ఎక్కడానికి ఎగబడుతున్న ప్రయాణికులు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, అక్టోబరు 11 : దసరా పండుగ నేపథ్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని వ్యాపార సముదాయాలు కిటకిటలాడాయి. వీధి వ్యాపారుల వద్ద బంతి పూలు, మామిడి ఆకులు కొనడానికి ప్రజలు ఆసక్తి కనబరిచారు. నూతన వస్త్రాల కొనుగోలు కోసం వచ్చిన కస్టమర్లతో జిల్లా కేంద్రంలోని ప్రధాన షాపింగ్ మాల్స్ నుంచి చిన్నపాటి బట్టల దుకాణాలు కిటకిటలాడాయి. పండ్లు, పూలు, కూరగాయలు, కిరాణా సామగ్రి కొనుగోలు చేయడానికి వచ్చిన ప్రజలతో పట్టణంలోని గాంధీచౌక్ ప్రాంతం కిక్కిరిసిపోయింది. సొంత ఊర్లకు పయనమైన ప్రయాణికులతో జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో పండుగ వాతావరణం నెలకొంది.







కలగానే బ్రిడ్జి నిర్మాణం

- నిధులు మంజూరైనా.. ప్రారంభంకాని పనులు
- అధికారులు, రాజకీయ నాయకులు స్పందించాలని కోరుతున్న గ్రామస్థులు



రోడ్డుపై పారుతున్న వరదనీరు

అడ్డాకుల, అక్టోబరు 11 : వర్షాకాలం వచ్చిందంటే చాలు ఆ గ్రామానికి రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఏదైనా అత్యవసరమైతే ఆ గ్రామస్థుల బాధలు వర్ణనాతీతం. మండల పరిధిలో 44వ జాతీయ రహదారి నుంచి బలీద్‌పల్లి గ్రామం దాదాపు రెండు కిలోమీటర్లు ఉంటుంది. గ్రామానికి వచ్చే ప్రధాన బీటీరోడ్డుపైనే ఒంపు కాలువ ఉంది. వర్షాకాలంలో గ్రామానికి సమీపంలోని కోమటికుంట నిండి గాజుఒంపు ద్వారా ఊకచెట్టు వాగులో కలిసి సరళాసాగర్‌కు వరద పారుతుంది. రోడ్డుపై నీరుపారినన్ని రోజులు గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. దాంతో పేరూరు, కురుమూర్తి, దేవరకద్రకు వెళ్లేవారికి, గ్రామం నుంచి జాతీయ రహదారి వద్దకు వచ్చే వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా గతంలో మంత్రి నిరంజన్‌రెడ్డి గాజుఒంపుపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా.. పనులు ప్రారంభం కావడంలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి విద్యార్థులు, ఆస్పత్రికి వచ్చే రోగులకు ఇబ్బందులు కలుగకుండా వెంటనే వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. జతీయరహదారిపైకి చేరుకోవాలంటే రాంగ్‌రూట్‌లో స్టేజీ వద్దకు వెళ్లాల్సి వస్తుందని, వెంటనే అండర్ బ్రిడ్జి నిర్మించి బలీద్‌పల్లికి వచ్చేలా సర్వీస్‌రోడ్డును నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నేటి నుంచి 'గుట్టమీది' జాతర

- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

నారాయణపేటరూరల్, అక్టోబరు11: మండలంలోని లక్ష్మీపూర్ గుట్టపై ప్రతి ఏటా మాదిరిగానే ఈఏడాది దసరా సందర్భంగా జాతరోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇక్కడి జాతరను పరిసర గ్రామాల ప్రజలు 'గుట్టమీది' జాతరగా పిలుస్తారు. విజయదశమితో పాటు మరుసటి రోజు వరకు ఇక్కడ జాతరను ఘనంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా తొలిరోజు శనివారం ఉదయం గ్రామం నుంచి గుట్టపైకి భజనలు, సంకీర్తనలు, మేళ, వాయిద్యాల మధ్య జల్దిబిందెను తీసుకెళ్లి స్వామివారికి అభిషేకం నిర్వహిస్తారు. అనంతరం స్వామివారికి పుష్పాలంకరణ తదితర ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం జాతరోత్సవాలు ప్రారంభమవుతాయి. జాతరలో పలు రకాల దుకాణ సముదాయాలు ఏర్పాటు చేస్తారు. పరిసర గ్రామాలతో పాటు కర్ణాటక సరిహద్దుల నుంచి ఈ జాతరను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. అర్ధరాత్రి దాటాక ఆదివారం తెల్లవారుజామున స్వామివారి మహారథోత్సవాన్ని నిర్వహిస్తారు. ఇక్కడ రెట్టపట్ల కార్యక్రమం కొనసాగుతుందని, ఇందులో గెలిచిన వారికి టెంకాయ, వెండికడియం తదితర బహుమతులను నిర్వాహకులు అందజేస్తారు. జాతరలో భక్తుల కోసం గుట్టపైకి ప్రత్యేక రహదారితో పాటు నీటి వసతిలాంటివి ముందస్తుగానే ఏర్పాటు చేశారు. ఈసారి ప్రత్యేకంగా స్వామివారి ఆలయం ఎదుట లక్ష్మీ, వినాయకుడు, అలివేలుమంగ, స్వామివారి పాదుకలను ప్రతిష్ఠింపజేశారు. ధ్వజస్తంభాన్ని కూడా దేవాలయం ఎదుట ప్రతిష్ఠించారు.



వేంకటేశ్వరస్వామి మూలవిరాట్

ఉద్యోగం సాధించిన విద్యార్థినికి సన్మానం

మూసాపేట, అక్టోబరు 11: మండలంలోని జానంపేట అనుబంధ గ్రామం తాళ్లగడ్డకు చెందిన నాగలక్ష్మీ, నర్సింహులుగౌడ్ దంపతుల కుమార్తె సంగీత డీఎస్సీ ఫలితాల్లో జిల్లాస్థాయిలో 85వ ర్యాంకు సాధించి ఎస్జీటీ ఉపాధ్యాయ ఉద్యోగాన్ని సాధించింది. దీంతో శుక్రవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మండల సంఘం ఆధ్వర్యంలో ఆమెను సన్మానించారు. తిరుపతయ్యగౌడ్, శశిధర్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, విజయకుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



జిన్నారం తండాలో క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకుడు

గండీడ్, అక్టోబరు 11 : మండల పరిధి లోని జిన్నారం తండాలో తుల్జాభవాని క్రికెట్ టోర్నమెంట్‌ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఆశిరెడ్డి ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత ఫోన్‌లకు అంకితం కాకుండా సెలవు రోజుల్లో క్రీడలకు ప్రాధా న్యత ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో యువకులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రయాణికులతో కిటకిటలాడుతున్న పాలమూరు బస్టాండ్



మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబరు 11 : దసరా ఉత్సవాల సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. పట్టణాల నుంచి గ్రామాలకు ప్రయాణికులు తరలి వెళ్లారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆర్టీసీ ప్రయాణికులను తరలించేందుకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఈ నెల 2 నుంచి 11వ తేదీ వరకు ఉమ్మడి జిల్లాలో 649 ప్రత్యేక బస్సులను నడిపించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రయాణికులను గమ్యస్థానాలను తరలించడమే ఆర్టీసీ సంస్థ ధ్యేయమని ఆర్టీసీ ఆర్.ఎం. శ్రీదేవి తెలిపారు. ప్రయాణికుల రద్దీ కనిపిస్తే వెంటనే ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి రద్దీని క్లియర్ చేసేందుకు చర్యలు తీసుకున్నారు. గత సంవత్సరం కంటే అదనంగా బస్సులను నడిపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పండుగ తర్వాత కూడా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రయాణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సరం కంటే అదనంగా ఆదాయం అంచనా వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వం ఈ నెల 2వ తేదీ నుంచి పర్వదినం సెలవులు ప్రకటించడంతో విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పర్వదినం పురస్కరించుకొని గురువారం నుంచి ప్రయాణికుల రద్దీని క్లియర్ చేసేందుకు అదనంగా బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు డి.ఎం. సుజాత తెలిపారు. పర్వదినం తర్వాత తిరుగు ప్రయాణంలో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండే వీలు ఉంది కనుక అదనంగా బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

కొత్తకోట, అక్టోబరు 11 : జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెం దగా నలుగురికి గాయాలైన సంఘటన కొత్తకోట మండలం లో చోటు చేసుకుంది. ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివ రాల ప్రకారం.. నాటవెల్లి గ్రామ దగ్గరలో జాతీయ రహ దారిపై కొత్తకోటలో స్థిరపడిన ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన బిపిన్, హరిశంకర్, అంకిత్, సుఫిల్ పొలాల్లో కంపోండ్ వాల్ నిర్మిం చి కొత్తకోటకు వచ్చేందుకోసం రోడ్డు పక్కన నిలబడ్డారు. ఆ సమయంలో కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కా రు అతివేగంగా వచ్చి వారిని ఢీకొట్టింది. ప్రమాదంలో బిపిన్ (30) తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందా డు. గాయాలైన హరిశంకర్, అంకిత్, సుఫిల్‌లను చికిత్స కో సం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అలాగే విలియంకొండ తం డా స్టేజీ సమీపంలో కేరళ నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న ఆరంజ్ ట్రావెల్స్ బస్సుకు వనపర్తి మండలం మెంటంపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి, మైనోద్దీన్ బైక్‌పై రాంగ్ రూ ట్‌లో వెళ్తు అదుపు తప్పి బస్సును ఢీకొన్నారు. తలకు గాయ మై శ్రీనివాస్‌రెడ్డి(45) ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. గాయపడిన మైనోద్దీన్‌ను చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి తర లించారు. కేసు నమోదు చేసి రెండు మృతదేహాలను పోస్టు మార్టం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

హామీల అమలు ఏదీ?

- ప్రజాపాలనలో వేల సంఖ్యలో పింఛన్ దరఖాస్తులు
- ప్రస్తుత పింఛన్లు 73,915
- దరఖాస్తు చేసుకున్న వారందరికీ పింఛన్ ఇవ్వాలి



పింఛన్ కొరకు వేచి ఉన్న వృద్ధులు, దివ్యాంగులు

ఆత్మకూరు, అక్టోబరు11: ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో అర్హులైన వారందరికీ పింఛన్ మంజూరు చేసి రూ.4 వేలు ప్రతి నెల ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు అమలు చేయలేదని జిల్లా వ్యాప్తంగా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం అధికారం చేపట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం గత ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ఆర్ ప్రభుత్వం నెలకు రూ.200 ఇస్తున్న పింఛన్‌ను రూ.వెయ్యికి పెంచి పింఛన్‌దారుల ఓట్లతో మరో మారు అధికారం చేపట్టింది. అలాగే 2018లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం వృద్ధులు కుటుంబానికి భారం కాకూడదని, అలాగే వితంతువులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఒంటరి మహిళలకు పొద్దస్తమానం కష్టపడిన బీడీ కార్మికులకు మిగిలేది లేదని, దీనికి తోడు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నామని, అలాగే నేతన్నలకు గౌడన్నలకు పింఛన్ ఇవ్వాలని ధర్నాలు, రాస్తా రోకోలు నిర్వహించడంతో ప్రభుత్వం గుర్తించి వారికి పింఛన్ మంజూరు చేసింది. ప్రస్తుతం కల్తీ ఆహారం తింటూ.. దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్ వంటి వ్యాధులకు గురవుతున్నారు. వారికి నెలకు రూ.1000 మాత్రమే ఇస్తే కనీస ఖర్చు లకు కూడా సరిపోదని గుర్తించి మరో అడుగు ముందుకు వేసి రూ.2000 పెంచి పింఛన్‌దారుల కళ్లల్లో ఆనందం వెలికి చూసింది. అదే మాది రిగానే ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల మేనిఫెస్టోలో పింఛన్‌దారులకు ప్రస్తుతం ఇస్తున్న రూ.2వేలు ఏపాటికి సరిపోదని గుర్తించి మేము అధికారం చేపట్టిన వెంటనే ప్రస్తుత పింఛన్‌ను రూ.4వేలకు పెంచి ఇస్తామని హామీ ఇచ్చారు. ఓట్లు వేయించుకుని 10 నెలలు గడుస్తున్నా.. ఇప్పటి వరకు ఇచ్చిన హామీని నెరవేర్చడం లేదని వృద్ధులు, వితంతువులు, ఒం టరి మహిళలు, దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వనపర్తి జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం ప్రతీ నెల ఇస్తున్న పింఛన్లు

వృద్ధులు 29,068, దివ్యాంగులు 11,355, వితంతువులు 28,883, నేత కార్మికులు 601, గీతకార్మికులు 412, ఒంట రి మహిళలు 2,566, బీడీ వర్కర్స్ 973, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి 57 మందికి పెన్షన్లు అమలు అవుతున్నాయి. మొత్తం కలుపుకొని జిల్లాలో 7,3915 మందికి మాత్రమే ప్రస్తుతం పెన్షన్లు అమలు అవుతున్నాయి. అప్పటి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ వయసును 60 సంవత్సరాల నుంచి 57 సంవత్సరాలకే కుదించడంతో జిల్లా మొత్తంలో 14 మండలాలను కలుపుకొని వేల సంఖ్యలో పింఛన్లకు అర్హులు దరఖాస్తులు చేసుకున్నారు. దీనికి తోడు వనపర్తి జిల్లా వ్యాప్తంగా బీడీ కార్మికులు అత్యధికంగా ఉన్నారు. వారికి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర సర్వే ద్వారా బీడీ కార్మికులను ఎంపిక చేసి పింఛన్ అందజేస్తుంది. కానీ కార్మిక సంఘాలు ఉద్యమాలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించడంతో పీఎఫ్ అమలవుతున్న వారికి కూడా పింఛన్ అమలు చేస్తామని హామీ ఇచ్చారు. దరఖాస్తు చేసుకోవడానికి ఆన్‌లైన్ ఓపెన్ కావడంలేదని బీడీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ అర్హులైన వారందరికీ పింఛన్ అమలు చేయాలని కోరుతున్నా రు.

ప్రజా పాలనలో వేల సంఖ్యలో దరఖాస్తులు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తక్షణమే ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేస్తామని అధికారం చేపట్టారు. మాటలను నిజం చేస్తారేమో అన్నట్టుగా గతేడాది 28-12-2023 నుంచి రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో 6-1-2024 వరకు ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పింఛన్, రేషన్ కార్డు, ఉచిత సిలిండర్ వంటి సంక్షేమ పథకాలపై దరఖాస్తులు చేసుకోవాలని గ్రామాల్లో ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా అర్హులైన వారందరూ దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తులు చేసుకొని 9 నెలలు గడుస్తుందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన హామీ ప్రకారం రూ.4 వేల మాట అమలు అటుంచితే, కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి నూతనంగా పింఛన్లు ఇవ్వడం లేదని తెలిపారు. తక్షణమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ఒకటైన పింఛన్ హామీని అమలు చేసి కొత్త పింఛన్లను మంజూరు చేయాలని వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, బీడీ కార్మికులు కోరుతున్నారు.

అర్హులకు పింఛన్ రాలే



దశాబ్ద కాలం నుంచి బీడీ పనిని ఆధారం చేసుకుని జీవనం సాగిస్తున్నాం. నెల అంతా కష్టపడితే రూ.4 వేలు కూడా వచ్చేది కష్టంగా ఉంది. దీంతో కుటుంబం గడవక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. బీడీ కార్మికురాలుగా ఫ్యాక్టరీ నుంచి గుర్తింపు కార్డు, పీఎఫ్ అమలు అవుతున్నా.. పింఛన్ ఇవ్వడం లేదు. నూతనంగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ గుర్తించి పింఛన్ అమలు చేయాలి.

- సి. జ్యోతి, మూలమల్ల, ఆత్మకూరు మండలం

పింఛన్లు అందజేస్తున్నాం



జిల్లా వ్యాప్తంగా అమలవుతున్న పింఛన్‌దారులందరికీ సకాలంలో పోస్టాఫీస్, బీపీఎంల ద్వారా పింఛన్లు అందజేస్తున్నాం. నూతనంగా పింఛన్‌దారులను ఎంపిక చేసేందుకు ప్రజా పాలన ద్వారా దరఖాస్తులను ఆయా మండలాల వారీగా సేకరించాం. ప్రభుత్వం మంజూరు చేస్తేనే అర్హులైన లబ్ధిదారులందరికీ పింఛన్ అందించే అవకాశం ఉంది.

- భీమయ్య, వనపర్తి జిల్లా అదనపు డీఆర్‌డీవో

మురుగునీటిలో తాగునీటి పైప్‌లైన్

- మూడు నెలలుగా ఇదే పరిస్థితి
- ఫిర్యాదు చేసినా స్పందించని అధికారులు



పైప్‌లైన్ మునిగిపోయిన మురుగునీటి గుంత

గద్వాల టౌన్, అక్టోబరు 11 : గద్వాల పట్టణంలోని 24వ వార్డు పరిధిలోని అహ్మదీనగర్‌లో మిషన్ భగీరథ పైప్‌లైన్ మూడున్నర నెలలుగా మురుగు నీటిలోనే ఉంది. కాలనీలో డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో, జూలై రెండవ వారంలో కురిసిన భారీ వర్షాలకు మురుగునీరు నిలిచిపోయింది. ఆ నీటిలోనే తాగునీటి పైప్‌లైన్ ఉంది. విషయం తెలుసుకున్న మునిసిపల్ ఛైర్మన్, కమిషనర్, స్థానిక కౌన్సిలర్ విజ్ఞప్తి మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలిం చారు. వర్షపునీరు ముందుకు వెళ్లే పరిస్థితి లేకపోవడం వల్లే సమస్య తలెత్తినట్లు గుర్తించారు. స్థానిక కౌన్సిలర్ సొంత ఖర్చుతో తాత్కాలిక డ్రైనేజీ ఏర్పాటు చేసేందుకు యత్నించారు. కానీ పెద్దబండ రాళ్లు అడ్డుగా ఉండటం తో చేసేది లేక వదిలేశారు. అప్పటి నుంచి సమస్య అలాగే ఉండిపోయింది. అదే నీటిలో నుంచి పైప్ లైన్ వెళ్తుండటంతో తాగునీరు వాసన వస్తోందని స్థానికులు చెప్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కాలనీలో పూర్తి స్థాయి డ్రైనేజీ నిర్మించాలని, సీసీ రోడ్లు వేయిం చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అధికారులు స్పందించాలి



కాలనీలో మిషన్ భగీరథ పైప్‌లైన్ మురుగునీటిలో ఉన్నందువల్ల నీరు తాగాలంటేనే భయం అవుతోంది. ఆ నీరు తాగి రోగాల బారిన పడితే మా పరిస్థితి ఏంటి. అలాంటి పరిస్థితి తలెత్తకముందే అధికారులు స్పందించాలి. కలెక్టర్, ఎమ్మెల్యే కాలనీలో పర్యటించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

- మెహబూబ్ బీ

కాలనీలో డ్రైనేజీ నిర్మించాలి



కాలనీ ఏర్పడి పదేళ్లు కావస్తున్నా డ్రైనేజీ నిర్మింకపోవడం సమస్యగా మారింది. ఇళ్ల మధ్య వర్షపు నీరు నిల్వ ఉండటంతో పిచ్చిమొక్కలు, కంపచెట్లు పెరిగాయి. అంతర్గత రోడ్లు లేకపోవడంతో రాత్రి వేళ ఇళ్లకు వెళ్లాలంటే ఇబ్బంది అవుతోంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.


- జహీర్

పీహెచ్‌సీలో సమస్యల తిష్ఠ

- నిధులు మంజూరైనా పూర్తికాని పనులు
- వర్షం వస్తే గదుల్లోకి చేరుతున్న నీరు
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రోగులు



మిడ్జిల్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం



గోడల నుంచి వస్తున్న వర్షం నీరు (ఫైల్)

మిడ్జిల్, అక్టోబరు 11: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మరమ్మతు చేపట్టేందుకు నిధులు మంజూరైనా.. సమస్యలు మాత్రం పరిష్కారం కావడంలేదు. పైకప్పు రేకులు రంధ్రాలు పడ్డాయి. చిన్నపాటి వర్షం వచ్చినా.. నీరు కారుతుంది. దీంతో రోగులు చికిత్స పొందే గదితో పాటు వైద్యులు రోగులకు చూస్తున్న గదుల్లో వర్షానికి గోడలనుంచి నీరు కారుతుంది. ఏడాది కిందట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరమ్మతుకు రూ.30 లక్షల నిధులు మంజూరవగా.. పనులు మాత్రం పూర్తి స్థాయిలో చేపట్టకపోవడంతో పరిస్థితి ఇబ్బందిగా మారింది. నిత్యం రోగులతో రద్దీగా ఉండే ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో చిన్నపాటి వర్షం వస్తే.. రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల లీకేజీల పేరుతో మరమ్మతు చేపట్టినా.. ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వచ్చే రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గోడలు తడిగా ఉండటంతో గోడలకు తాకితే షాక్ వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికే కలెక్టర్ జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించినా.. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో నెలకొన్న సమస్యలు పరిష్కారం కావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి..

ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి. పూర్తి స్థాయిలో మరమ్మతు చేపట్టకపోవడంతో చిన్నపాటి వర్షం వచ్చినా ఇబ్బందిగా మారింది. లేబర్ రూం పైకప్పు రేకులకు రంధ్రాలు పడి చిన్న వర్షం వచ్చినా.. మొత్తం వర్షం నీటితో నిండిపోతుంది. ఇటీవల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన జిల్లా అధికారుల దృష్టికి సమస్యలు తీసుకెళ్లాం.

- శివకాంత్, వైద్యుడు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మిడ్జిల్

ఖాదర్ మృతి సీఐటీయూకు తీరని లోటు

పాలమూరు, అక్టోబరు 11 : ఆటో యూనియన్ (సీఐటీయూ అనుబంధం)జిల్లా అధ్యక్షుడు ఖాదర్ మృతి సంఘానికి తీరనిలోటని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి అన్నారు. ఖాదర్ గురువారం రాత్రి దివిటిపల్లి డబల్ బెడ్‌రూం కాలనీలో గుండెపోటుతో మరణించారని తెలిపారు. శుక్రవారం ఆయన భౌతికకాయానికి సీఐటీయూ తరపున పూలమాలవేసి నివాళి అర్పించారు. వంద ఎకరాల భూమి కలిగిన కుటుంబంలో పుట్టినప్పటికీ ఖాదర్ సాధారణ జీవితం గడిపారన్నారు. ఆటో డ్రైవర్, తాపీ మేస్త్రీ, కార్మిక నాయకుడిగా పనిచేసి 25ఏళ్లనుంచి సీఐటీయూ ఆటోడ్రైవర్ యూనియన్ నాయకుడిగా పని చేస్తున్నారని వివరించారు. సీఐటీయూ నాయకులతో పాటు గడ్డమీది గోపాల్ పాల్గొని నివాళి అర్పించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మూసాపేట, అక్టోబరు 11 : మండలంలోని పోల్కంపల్లి బీఆర్ఎస్ కమిటీ అధ్యక్షుడు నర్సింహులుగౌడ్ తల్లి నర్సమ్మ ఇటీవల మరణించారు. శుక్రవారం గ్రామంలో దశదినకర్మ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి హాజరై బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఇంద్రయ్యసాగర్, లక్ష్మీనర్సింహయాదవ్, పల్లి శివరాములు, చంద్రశేఖర్, మధు, యాదయ్య, నర్సింహులు పాల్గొన్నారు.

తరచూ కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్

- వరి పంటలు ఎండిపోయి ఆందోళన చెందుతున్న రైతులు
- మంజూరైన మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని డిమాండ్

మూసాపేట, అక్టోబరు 11: మండలంలోని నిజాలాపూర్ గ్రామ శివారులోని పంట పొలాల్లోకి 63 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తరచుగా కాలిపోవడంతో బోరు బావులు పనిచేయక వరి పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నాలుగు సార్లు ఈ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోగా.. రైతులు అష్టకష్టాలు పడి, ఎంతో ఖర్చుతో జడ్చర్లకు తీసుకెళ్లిన వారం రోజుల్లోనే మళ్లీ కాలిపోతుందని రైతులు మిద్దెల మొత్కన్న, గోవర్ధన్ బోరున విలపిస్తున్నారు. ఆ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఇక్కడ సుమారు 12 బోరు మోటార్లు ఉన్నాయని, అందరూ ఒకేసారి మోటార్లు ఆన్‌చేయడంతో సమస్య తలెత్తుందని కొందరు రైతులు పేర్కొన్నారు.

అధిక లోడ్‌ను నియంత్రించడానికి గతంలో విద్యుత్ శాఖ అధికారులు రెండు నియంత్రికలు మంజూరు చేశారని, వాటిని సకాలంలో అమర్చ లేదని, కేవలం స్తంభాలు పాతి వదిలేశారని చెప్పారు.

వాగు దాటడానికి నరకయాతన..

ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించడానికి పెద్దవాగు తప్పా.. మరేదారి లేదు. వాగు పారుతుండటంతో ఎంతో ఖర్చు పెట్టి ఎక్స్‌కవేటర్ సాయంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకెళ్లాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదే పదే మరమ్మతు చేయించినా ఫలితం ఉండటంలేదని, చేతికి వచ్చిన పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని వాపోతున్నారు. తాజాగా గురువారం ట్రాన్స్‌ఫార్మర్ కాలపోయిందని చెప్పారు. సమస్యను జానంపేట విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు వెళ్లి అధికారులకు తెలియజేశామన్నారు. సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.



పెద్దవాగులో ఎక్స్‌కవేటర్ ద్వారా ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకెళ్తున్న రైతులు

'ఐ లవ్ అచ్చంపేట' లోగో ఆవిష్కరణ

అచ్చంపేటటౌన్ అక్టోబరు 11: పట్టణంలోని భక్తమార్కండేయ ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన ఐలవ్ అచ్చంపేట లోగోను శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆవిష్కరించారు. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను తయారు చేశారు. అక్కడే మహిళలు పెద్ద ఎత్తున్న ఏర్పాటు చేసిన బతుకమ్మ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పూలను పూజించే రాష్ట్రం ఒక్క తెలంగాణ రాష్ట్రమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. ఆడపడుచులు ఆటపాటలతో కలిసి బతుకమ్మలు ఆడారు.



పాటలు పాడుతున్న నల్గొండ గద్దర్

నల్లగొండ గద్దర్ (నర్సిరెడ్డి), గాయకులు గంగా, బిగ్‌బాస్ ఫేమ్ బోలే షావలితో పాటు గాయకుల పాటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.



అచ్చంపేటలో ఏర్పాటు చేసిన 'ఐలవ్ అచ్చంపేట' లోగో

భూసమస్యల పరిష్కారానికి ప్రజాయాత్ర

హన్వాడ, అక్టోబరు 11 : భూ సమస్యలపై ప్రజలను చైతన్య పరిచేందుకు ప్రజాయాత్ర నిర్వహిస్తున్నట్లు సాధిక ఫౌండేషన్ ఛైర్మన్ హైకోర్టు న్యాయవాది సాదత్ అలీ అన్నారు. శుక్రవారం మండలంలోని గుడిమల్కాపూర్ గ్రామంలో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భం గా రైతులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ధరణీ స్థానంలో భూమాత చట్టం వస్తుందని న్యాయం చేసేందుకు ప్రభుత్వం ప్రజాభిప్రాయం తీసుకొని మార్పులు చేర్పులు చేయాలని కోరారు. యాత్రలో భూసమస్యలపై అధయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రపంచాన్ని మార్చేది చదువు మాత్రమే

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- కేసీఆర్ చేసిన అప్పులకు వడ్డీలు కడుతున్నామంటూ ఎద్దేవ
- బాలానగర్‌లో యంగ్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన


మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, అధికారులు

బాలానగర్/చిన్నచింతకుంట, అక్టోబరు 11 : ప్రపంచాన్ని మార్చే శక్తి కేవలం చదువుకు మాత్రమే ఉంటుందని.. అలాంటి ప్రాముఖ్యత తెలిసిన కాంగ్రెస్ సర్కార్ తెలంగాణ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ శంకుస్థాపన కార్యక్రమనికి శ్రీకారం చుట్టిందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలోని పెద్దాయపల్లి శివారులో సుమారు 18 ఎకరాల విస్తీర్ణంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల శంకుస్థాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ఎక్కడాలేని విధంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను ప్రభుత్వం నిర్మిస్తుందని, ఇది సంతోషకరమైన విషయమన్నారు. ఈ పాఠశాలలో నాలుగో తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యాభ్యాసం కొనసాగుతుందని, ఒకే క్యాంపస్‌లో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు వేర్వేరుగా భవనాలు ఉంటాయన్నారు. పదేళ్ల పాటు విద్యార్థులకు వసతి సౌకర్యం అన్ని వసతులతో కల్పిస్తామన్నారు. మొత్తం రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలకు గాను 60వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, మరో 1.30లక్షల ఉద్యోగాలకు జాబ్ క్యాలెండర్ అసెంబ్లీలో ప్రకటించడం జరిగిందని గుర్తు చేశారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్ని వదిలేసి పేదల కోసం సేవ చేయడానికి రాజకీయాల్లోకి వచ్చారని, అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం పైనే తిగబడే నాయకుడని ప్రశంసించారు. మాజీ సీఎం కేసీఆర్ చేసిన అప్పులకు కాంగ్రెస్ సర్కార్ ఇప్పటికి వడ్డీ కడుతుందని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నామని, ప్రభుత్వ బడ్జెట్‌ను దుబారా చేసి హరీ‌శ్‌రావు రుణమాఫీపై అర్థం లేని మాటలు మాట్లాడుతున్నారన్నారు.

చదువు లేకుంటే అభివృద్ధికి దూరం: ఎమ్మెల్యే

ఆధునిక కాలంలో మనిషికి చదువు లేకుంటే అభివృద్ధికి దూరమైనట్లేనని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.150 కోట్లు ఖర్చు పెడుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు 28 నియోజకవర్గాల్లో పాఠశాలలకు శంకుస్థాపనలు చేశారని తెలిపారు. పాఠశాల నిర్మాణం కోసం మొత్తం 25 ఎకరాల అవసరం అవుతాయని, ప్రస్తుతం 18 ఎకరాలు ఉందని, మిగతా భూమి కోసం నివేదిక పంపామని వివరించారు. రాష్ట్రంలో మూడు స్టేడియంలు నిర్మిస్తుండగా ఒకటి బాలానగర్ మండలానికి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. విశ్వ విద్యాలయాల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు పెంచుకునేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకి మాట్లాడారు. మంత్రికి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో డీఈవో రవీందర్, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, నయాబ్ తహసీల్దార్ నిఖితారెడ్డి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

విద్యాభివృద్ధికి ఎంత ఖర్చయినా భరిస్తాం

విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎన్ని కోట్లయినా వెచ్చించేందుకు సిద్ధంగా ఉందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని దమాగ్నాపూర్ ఎర్రగట్టు వద్ద యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిరబోయి, అదనపు కలెక్టర్ మోహన్‌రావు, సీతాదయాకర్‌రెడ్డి, స్వర్ణసుధాకర్‌రెడ్డితో కలిసి భూమి పూజ చేశారు.

రెసిడెన్షియల్ స్కూళ్లతో విప్లవాత్మకమైన మార్పులు



తూడుకుర్తిలో ప్రసంగిస్తున్న ఎంపీ మల్లురవి

నాగర్‌కర్నూల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రం లో ప్రారంభించనున్న యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లతో విద్యాభివృద్ధిలో విప్లవాత్మకమైన మార్పులు రానున్నాయని పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లురవి పేర్కొన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ కింద నాగర్ కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేటలలో మినీ కళాభవన్‌ల ను నిర్మించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం నాగర్‌కర్నూల్ మండలంలోని తూడుకుర్తి గ్రామంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఎమ్మెల్సీ కూచ కుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద పార్లమెంట్ నియోజ కవర్గం పరిధిలో 3మినీ కళాభవన్‌లు నిర్మించాలని షై హోం అధినేత రామేశ్వర్‌రావును కోరగా అందుకు ఆ యన సానుకూలంగా స్పందించారని మల్లురవి చెప్పారు. అచ్చంపేటలో మాజీ మంత్రి మహేంద్రనాథ్, కొల్లాపూర్‌లో మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర్‌రావు, నా గర్‌కర్నూల్‌లో మాజీ ఎంపీ దివంగత మల్లు అనంతరా ములు పేరిట కళా భవన్ నిర్మాణాలు జరుగుతాయని చెప్పారు.

ఆకాశంలో కమ్ముకున్న మబ్బులు



వనపర్తి మండలం చిట్యాల సమీపంలోని కొత్త మార్కెట్ యార్డు సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం ఎండ వేడిమితో ఉక్కపోతగా ఉంది. అంతలోనే ఆకాశంలో పాలనురగలాంటి మేఘాలు జతకట్టినట్లుగా ప్రయాణిస్తున్నాయి. ఈప్రాంతంలోనే ఓ చోట ఎండ.. మరోచోట నీలి, నల్లని మబ్బులతో చల్లదనాన్ని ఇచ్చాయి. ఈ దృశ్యాలు ఆంధ్రజ్యోతి తన కెమెరాలో బంధించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి

చోరీలకు పాల్పడుతున్న ముగ్గురి అరెస్ట్


కొత్తకోటలో నిందితుడితో ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి


పెబ్బేరులో నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

కొత్తకోట, అక్టోబరు 11 : వరుస చోరీలకు పాల్పడుతున్న దంపతులను పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం వనపర్తి జిల్లా కొత్తకోట ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 6వ తేదీన కొత్తకోట పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన శివ ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. గుంపుగట్టు సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న దంపతులు రామకృష్ణ, మౌనికను అదు పులోకి విచారించారు. శివ ఇంటితో పాటు పాలెంలో ఓ ఇంట్లో చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. నిందితుల నుంచి తుల ఒన్నర బంగారు, కేజీన్నర వెండి వస్తువులను స్వాధీనం చేసుకుని కోర్టుకు తరలించారు. న్యాయ అధికారి ఆదేశం మేరకు మహబూబ్‌నగర్ జైలుకు తరలించినట్లు ఎస్ఐ చెప్పారు.

మరో నిందితుడు రిమాండ్

పెబ్బేరు: ఇటీవల పెబ్బేరు పట్టణంలో మూడు చోరీలకు పాల్పడిన కంసాలి బ్రహ్మయ్యను పోలీసులు శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్ఐ హరి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. పెబ్బేరులో వాహనాలు తనిఖీ చేస్తుండగా బ్రహ్మయ్య వాహనంలో ఇనుపరాడ్డు ఉండగా, ప్రశ్నించడంతో పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించాడు. అతడిని పట్టుకొని స్టేషన్‌కు తరలించి విచారణ చేయగా పెబ్బేరు పట్టణంలో మూడు చోరీలు, కొత్తకోట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముమ్మాళపల్లిలో మరో రెండు చోరీలు చేసినట్లు ఒప్పుకోవడం జరిగింది. కేసులకు సంబంధించిన రూ.2.60లక్షల నగదు, రెండు కాళ్ల పట్టీలు, కమ్మలు, ఉంగరం స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో హాజరుపరిచి రిమాండ్ తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

జోగుళాంబ అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ


అమ్మవారికి పట్టు వస్త్రాలను తీసుకొస్తున్న కలెక్టర్ దంపతులు

అలంపూర్, సెప్టెంబరు 11 : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం అలంపూర్ జోగుళాంబ అమ్మవారికి కలెక్టర్ బీఎం సంతోష్, డాక్టర్ కెచేరి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. అంతకు ముందు వారికి ఈవో పురేందర్‌కుమార్, ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. ఆ తర్వాత వేదాశీర్వచన మండపంలో వారికి శేషవస్త్రం అందించి సత్కరించారు. అలాగే ప్రముఖ సినీ నటుడు టార్జాన్ కుటుంబసమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. అమ్మవారి దీక్ష చేపట్టిన 75 మంది మాతలు ఇరుముడి ధరించి పట్టణంలోని సంగమేశ్వర స్వామి ఆలయం ఊరేగింపుగా వచ్చారు. కార్యక్రమంలో జోగుళాంబ సేవాసమితి వ్యవస్థాపకుడు బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం


డివైడర్‌పై ఎక్కిన కారు

జడ్చర్ల, అక్టోబరు 11 : జాతీయ రహదారి జడ్చర్ల మునిసి పాలిటీ స మీప ంలో తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. జాతీ య రహదారి నుంచి ఫ్లైఓవర్ ప్రారంభం వద్ద జడ్చర్ల పట్టణంలోకి వచ్చే దారి వద్ద టైరు పగిలి ఓ కారు రోడ్డుపై నిలిచింది. అదే దారిలో ఓ నాయకుడి కారును డ్రైవర్ నడుపుతూ.. రోడ్డుపై నిలిచిన కారును తప్పించబోయి డివైడర్‌ను ఢీకొట్టాడు. బాలానగర్ మండలంలోని పెద్దాయిపల్లిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ శంకుస్థాపన అనంతరం శుక్రవారం సాయంత్రం నాయకులు జడ్చర్ల మీదుగా దేవరకద్ర నియోజకవర్గం చిన్నచింతకుంటకు వెళ్తుండగా.. ఈ సంఘటన చోటుచేసుకుంది. ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు.

ముడా చైర్మన్‌గా లక్ష్మణ్‌యాదవ్

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం


లక్ష్మణ్‌యాదవ్

మహబూబ్‌నగర్, అక్టోబరు 11 : మహబూబ్‌నగర్ అర్బన్ అథారిటీ చైర్మన్‌గా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ లక్ష్మణ్‌యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం జీవో విడుదల చేసింది. మహబూబ్‌నగర్ అర్బన్ అథారిటీ 141 గ్రామాలకు విస్తరించి ఉంది. జిల్లాలోని మూడు నియోజకవర్గాలలోని అధిక గ్రామాలు దీని పరిధిలోనే ఉన్నాయి. కీలకమైన ఈ పదవికి పెద్దఎత్తున పోటీ నెలకొంది. ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గానికే పదవి కేటాయించాలని పట్టుబట్టడంతో ఆలస్యమైంది. చివరకు ఎమ్మెల్యేల అందరి ఏకాభిప్రాయంతో కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న లక్ష్మణ్‌యాదవ్‌ను ఎంపిక చేశారు. న్యాయవాది అయిన ఈయన మొదటినుంచి పార్టీలోనే పనిచేశారు. ఎన్ఎస్‌యూఐ పట్టణ అధ్యక్షుడిగా, జిల్లా ప్రధాన కార్య దర్శి రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. రెండు పర్యాయాలు సద్దలగుండు నుంచి కౌన్సిలర్‌గా గెలిచి, 2019లో ఆ వార్డు మహిళకు రిజర్వ్ కావడంతో భార్య స్వప్నను బరిలోకి దించి గెలిపించుకున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఐదుగురు కౌన్సిలర్‌లు గెలువగా నలుగురు బీఆర్ఎస్‌లో చేరగా ఆయన మాత్రం కాంగ్రెస్ పార్టీని వీడకుండా అందులోనే కొనసాగారు. తనపై ఎంతో నమ్మకంతో ముడా చైర్మన్ బాధ్యతలు అప్పగించిన ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, పార్టీ ముఖ్యనాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత: కేసు నమోదు

కల్వకుర్తిటౌన్, అక్టోబర్ 11 : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలంలోని కుర్మిద్దలో శుక్రవారం ఇంట్లో అక్రమ ంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకు న్నారు. ఎస్ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సివిల్ సప్లయ్ డీటీ రాఘవేందర్, ఎస్ఐ కలిసి విశ్వసనీయ సమాచారం మేరకు గ్రామంలో దాడులు నిర్వహించగా సత్యం ఇంట్లో నిల్వ ఉంచిన 3.5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

మట్టి టిప్పర్ పట్టివేత

గద్వాల క్రైం, అక్టోబరు 11 : అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను శుక్రవారం పట్టణ పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. పట్టణ ఎస్ఐ కల్యాణ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గద్వాల మండలంలోని అనంతపురం గుట్టల నుంచి అక్రమంగా మట్టిని తవ్వి గద్వాలకు తరలిస్తుండగా మేలచెర్వు చౌరస్తాలో పట్టుకొని పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించడం జరిగిందన్నారు. ఈ మట్టిని బసల్‌చెర్వుకు చెందిన సుధాకర్‌రెడ్డి, డ్రైవర్ రాముడు తరలిస్తున్నారన్నారు. టిప్పర్‌ను మైనింగ్ అధికారులకు అప్పగిస్తామని తెలిపారు.

విద్యుదాఘాతంతో ఐదు గొర్రెలు మృతి

బిజినేపల్లి, అక్టోబరు 11 : ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తీగలకు తాకి ఐదు గొర్రెలు మృతి చెందాయి. బాధితుడు చంద్రకంటి తిరుపతయ్య శుక్రవారం తెలిపిన వివరాల మేరకు నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం నందివడ్డేమాన్ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ గడ్డి మేస్తుండగా ఐదు గొర్రెలు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాయి. గమనించిన గొర్రెల కాపరులు వెంటనే మిగతా వాటిని అటుగా వెళ్లకుండా దూరంగా చెదరగొట్టారు. విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏపుగా పెరిగిన చెట్లను, గడ్డి తొలగించకుండా వదిలేయడంతో రూ.80 వేల విలువైన గొర్రెలు మృత్యువాత పడ్డాయని గ్రామస్థులు తెలిపారు. బాధిత గొర్రెల కాపరికి విద్యుత్ శాఖ నుంచి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

బస్సు ఢీకొని ఎద్దు మృతి

మక్తల్, అక్టోబర్ 11 : ఆర్టీసీ బస్సు ఢీకొని ఎద్దు మృతి చెందిన ఘటన మక్తల్ మండలంలోని చందాపూర్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. చందాపూర్ చెందిన గంప మల్లేష్ శుక్రవారం తెల్లవారుజామున కాడెద్దులతో పొలానికి వెళ్తుండగా, హైదరాబాద్ నుంచి రాయచూరు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఎద్దు మృతి చెందగా రైతు మల్లేష్ స్వల్పంగా గాయపడ్డాడు. ఎద్దు మృతితో తన కుటుంబం రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని రైతు ఆందోళన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు కోరారు.

పర్దీపూర్ రిజర్వాయర్‌లో చేపపిల్లల విడుదల


రిజర్వాయర్‌లోకి చేపపిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట, అక్టోబరు 11: మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని పర్దీపూర్ సమీపంలోని రిజర్వాయర్‌లోకి శుక్రవారం దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెరువుల్లో చేప పిల్లలను వదిలేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, రిజర్వాయర్‌లోకి ఆరు వేల చేపపిల్లలను వదిలామని, త్వరలో కోయిల్‌సాగర్ ప్రాజెక్టులోకి కూడా వదులుతామని తెలిపారు. వెంకటేష్, ఉమామహేశ్వర్‌రెడ్డి, వట్టెం శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన


రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో జయరాములు

నవాబ్‌పేట, అక్టోబరు 11: మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని శుక్రవారం ఎంపీడీవో జయరాములు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో పర్యటించి గ్రామస్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గ్రామాన్ని ఆదర్శగ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే అంటురోగాలు వ్యాపించవని తెలియజేశారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

దేవరకద్ర, అక్టోబరు 11: రోడ్డు ప్రమాదంలో గురువారం 50 గొర్రెలు మృతిచెదాయని, ఆ గొర్రెల కాపరులను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వేణు గోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాపరుల కుటుంబాలు వాటిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారని, గొర్రెలు చనిపోవడంతో వారు రోడ్డున పడ్డారని పేర్కొన్నారు. వీరికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని కోరారు.

విద్యుదాఘాతంతో దంపతుల మృతి


దంపతులు బక్కయ్య, నాగమ్మ (ఫైల్)

రేవల్లి, అక్టోబరు 11 : శీతాఫలాల కోసం వెళ్లిన ఇద్దరు దంపతులు విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన శుక్రవారం వనపర్తి జిల్లా రేవల్లి మండలంలో చోటుచేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం కొత్త బండ రాయిపాకుల గ్రామానికి చెందిన దుస్తు బక్కయ్య (52), నాగమ్మ (45) దంపతులు సాయంత్రం ఆరు గంటలకు గ్రామ శివారులో గల పొలాల్లో ఉన్న శీతాఫలాలను తెంచుకొని రావడానికి వెళ్లారు. ఆ పక్కనే గల శానాయిపల్లి గ్రామ శివారులో ఓ రైతు తన పొలంలో వేరుశనగ సాగుచేశాడు. అడవి పంతుల బెడద ఉండటంతో ఆ పంట రక్షణ కోసం చుట్టూ విద్యుత్ వైరుతో కంచెను ఏర్పాటు చేసుకున్నాడు. దాన్ని గమనించని దంపతులిద్దరు ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లకు తగిలారు. దీంతో విద్యుత్‌షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందారు.

రెండు బైక్‌లు ఢీ: యువకుడికి గాయాలు

గండీడ్, అక్టోబరు 12 : రెండు బైక్‌లు ఢీకొని ఓ యువకుడికి గాయాలైన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం చిన్నవార్వల్ శివారులో చోటు చేసుకుంది గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రుసుంపల్లికి చెందిన గణేష్ కోస్గి పట్టణంలో కొరియర్ కంపెనీలో పనిచేస్తుండేవాడు. రోజు మాదిరి రుసుంపల్లి నుంచి బైక్ పై వెళ్తుండగా చిన్నవార్వల్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి బైక్‌తో ఎదురుగా ఢీకొట్టాడు. దీంతో గణేష్‌కు గాయాలు కావడంతో అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

కోడేరు, అక్టోబరు 11 : నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలోని ఎత్తంలో శుక్రవారం గుండెపోటుతో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ ఎడువుల శ్రీను(44)మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామంలో ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న శ్రీను ఉదయం మరుగుదొడ్లు లేని వారి జాబితా కోసం వివరాలు సేకరించి తిరిగి ఇంటికి వచ్చాడు. తన తమ్ముడికి ఎడమ వైపు నొప్పి వస్తుందని తెలుపగా అతని గుండెను సీపీఆర్ చేసి వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేయగా అంతలోపే మృతి చెందారని తెలిపారు. అతనికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

సొంత తమ్ముడిపై ఇద్దరు అన్నల దాడి

వడ్డేపల్లి, అక్టోబరు 11 : జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలంలోని తనగలకు చెందిన మహేష్‌పై తన సొంత అన్నలైన రమేష్, తిమ్మప్ప శుక్రవారం దాడి చేశారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మహేష్ తన పొలంలో మధ్యాహ్నం పని చేసుకునేందుకు వెళ్తుండగా మార్గమధ్యంలో అన్నలు దాడి చేయడంతో కాలు విరగడంతో పాటు తలకు బలమైన గాయమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయం గురించి శాంతినగర్ సీఐ టాటా బాబును సంప్రదించగా గతంలో కూడా గొడవపడి అయిజ పోలీస్‌స్టేషన్‌లో కేసులు ఉన్నాయని చెప్పారు. సాయంత్రం గ్రామాన్ని సందర్శించి కుటుంబసభ్యులతో సమాచారం సేకరించామని, గాయపడిన మహేష్‌ను చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. బాధిత కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో ఉండటంతో కేసు నమోదు చేయలేదని తెలిపారు.

यूनियन बैंक ऑफ इंडिया | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా A Government of India Undertaking

అసెట్ రికవరీ బ్రాంచ్
#249/3RT 1వ అంతస్తు, SR నగర్, మెయిన్ రోడ్ హైదరాబాద్-500038.

ఇ-వేలం అమ్మకం ప్రకటన
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూలు 8(6)నిబంధనలను చూడగలరు)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధనతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన. సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టబడిన/చార్జ్‌చేయబడినట్టి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సెక్యూర్డ్ క్రెడిటార్) అధీకృత అధికారి ద్వారా లాంఛనప్రాయ/వాస్తవిక స్వాధీనం చేసుకొనబడినట్టి దిగువ వివరించిన స్థిరాస్తి దిగువ తెలిపిన రుణగ్రహీత(లు) & హామీదారు (లు) నుండి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రావలసిన దిగువ తెలిపిన బకాయిలు రాబట్టుకొనుటకు, దిగువ తెలిపిన తేదీన "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా", "అక్కడ ఏమి ఉంటే అదే" మరియు "ఏది అక్కడ ఉంటో అదే" ప్రాతిపదికన విక్రయించబడతాయని ముఖ్యంగా రుణగ్రహీతలు మరియు హామీదారులకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది. రిజర్వు ధర మరియు బయానా దిగువ తెలియజేయబడినవి:

1 రుణగ్రహీత, సహిత తనఖాదారు పేరు మరియు చిరునామా : 1) M/s. ఎ-1 కోల్డ్ స్టోరేజ్ ప్రైవేట్ లిమిటెడ్, ఎఫ్.నం.బి-1, 6-3-1104, ప్రియ సరాన్ అపార్ట్‌మెంట్స్, రాజ్‌భవన్ రోడ్, సోమాజిగూడ, హైదరాబాద్-500082, తెలంగాణ. 2) శ్రీమతి బొల్ల హైమావతి, డైరెక్టర్ భర్త శ్రీ బి. శ్రీనివాసరావ్, జి-3, వశిష్ట అపార్ట్‌మెంట్స్, కొత్తపేట, చీరాల, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్ పిన్-523155. 3) శ్రీ మదనాచారి కాంచారి, డైరెక్టర్ తండ్రి మోనాచారి కాంచారి, 32 సం.లు, నం.2-28, నాంచర్ల, గాంధీన్, రంగారెడ్డి-509337, తెలంగాణ. 4) శ్రీమతి దువ్వూరు పరిజ, డైరెక్టర్ భర్త శ్రీ డి. సుబ్బారామిరెడ్డి, ఇ.నం.38, సంతోష్‌నగర్, మెహదీపట్నం, హైదరాబాద్-500028. హామీదారు/తనఖాదారు: 5) శ్రీ కొలను శ్రీనివాస్ రెడ్డి, తండ్రి శ్రీ తులసి రెడ్డి (స్వర్గీయ) ఇ.నం.1-2-47/4 & 5, నిజాంపేట్ రోడ్, నిజాంపేట్ గ్రామం, కుత్బుల్లాపూర్ మండలం, ఆర్ఆర్ జిల్లా, హైదరాబాద్-500090. 6) శ్రీ బొల్లబోయిన శేఖర్, తండ్రి శ్రీ బి. ముత్యాలు, ఇ.నం.3-83/1/ఏ/2/1, గోకుల్ నివాస్ అపార్ట్‌మెంట్స్, నిజాంపేట్, కూకట్‌పల్లి, హైదరాబాద్-500090.

సెక్యూర్డ్ రుణం రికవరీ కొరకు విక్రయించబడు స్థిర సెక్యూర్డ్ అస్తులు : 30.09.2024 నాటికి రూ.8,77,50,865.72/- తదుపరి వడ్డీ, వ్యయాలు, ఖర్చులు కలుపుకొని.

విక్రయించబడు సెక్యూర్డ్ స్థిరాస్తుల వివరణ
ఆస్తి నం.1 : తెలంగాణ రాష్ట్రం, మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల గ్రామ & గ్రామ పంచాయతీ వద్ద గల ఎ.1.04 గుంటలు (ఎ.5.37 సెంట్లలో)విస్తీర్ణ సర్వే నం. 453/ఎలో భూమి మరియు భవనం యావత్తు. సరిహద్దులు : ఉత్తరం : ఉద్దండపూర్ రోడ్ మరియు నందినీ గ్రీన్ హౌస్ ఫామ్స్ ప్రైవేట్ లిమిటెడ్, దక్షిణం : శాంతయ్య భూమి, తూర్పు : ఖాదిర్ భూమి, పశ్చిమం : భూస్వాముల మిగిలిన భూమి మరియు నందినీ గ్రీన్ హౌస్ ఫామ్స్ ప్రైవేట్ లిమిటెడ్.
నమోదిత విక్రయ దస్తావేజు డాక్యుమెంట్ నం.13432/2015, తేది : 09.11.2015, ఎస్ఆర్ఓ : మహబూబ్‌నగర్.
జిపిఎస్ కో-ఆర్డినేట్స్ : 17.438863, 78.58225

రిజర్వు ధర : రూ. 1,77,00,000/- బయానా : రూ. 17,70,000/- బిడ్ పెరుగుదల రూ. 1,77,000/-

2 రుణగ్రహీత / తనఖాదారు పేరు మరియు చిరునామా : 1) M/s. నందినీ గ్రీన్ హౌస్ ఫామ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఫ్లాట్ నం.14, ఫేజ్-3, మధురానగర్, ప్రగతి నగర్, కూకట్‌పల్లి, హైదరాబాద్-72. రుణగ్రహీత : 2) శ్రీమతి ప్రభావతి, ఇ.నం.2-62/ఎఫ్14, లక్ష్మీసాయి ఎన్‌క్లేవ్, మధురానగర్ కాలనీ, నిజాంపేట్ గ్రామం, హైదరాబాద్-500072. 3) శ్రీ బత్తిని వెంకటేశ్వర్లు, ఇ.నం.2-62/ఎఫ్14, లక్ష్మీసాయి ఎన్‌క్లేవ్, మధురానగర్ కాలనీ, నిజాంపేట్ గ్రామం, హైదరాబాద్-500072. హామీదారు : 4) శ్రీ ఎస్. శంకర్‌రెడ్డి, తండ్రి ఎస్. ఎల్లారెడ్డి, ఇ.నం.1-2-33/28/ఏ, ఫ్లాట్ నం.46, ప్రశాంత్ నగర్, నిజాంపేట్, హైదరాబాద్-500072.

సెక్యూర్డ్ రుణం రికవరీ కొరకు విక్రయించబడు స్థిర సెక్యూర్డ్ అస్తులు : 30.09.2024 నాటికి రూ.6,34,96,930.49/- తదుపరి వడ్డీ, వ్యయాలు, ఖర్చులు కలుపుకొని.

విక్రయించబడు సెక్యూర్డ్ స్థిరాస్తుల వివరణ
ఆస్తి నం.1 : తెలంగాణ-509301, మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల గ్రామం మరియు మండలం, ఉద్దండపూర్ రోడ్ వద్ద గల 19587.65 చ.అడుగుల మొత్తం విస్తీర్ణంలో స్టోరేజ్ హౌస్‌తో కోల్డ్ స్టోరేజ్ భవనం మరియు ఎ.1.02 గుంటలు లేదా 1.625 ఎకరాల విస్తీర్ణ సర్వే నం.453/ఎ లో భూమి యావత్తు. పాత వాల్యుయేషన్ ప్రకారంగా సరిహద్దులు: ఉత్తరం: రోడ్డు & భూస్వాములకు చెందిన మిగిలిన భూమి, దక్షిణం: ఎ-1 కోల్డ్ స్టోరేజ్ ప్రైవేట్ లిమిటెడ్, తూర్పు: ఎ-1 కోల్డ్ స్టోరేజ్ ప్రైవేట్ లిమిటెడ్, పశ్చిమం : భూస్వాముల యొక్క మిగిలిన భూమి. వాస్తవంగా : ఉత్తరం : రోడ్డు, దక్షిణం: పాక్షికంగా నిర్మించిన కోల్డ్ స్టోరేజ్, తూర్పు : పొరుగువారి ఖాళీ భూమి, పశ్చిమం : పొరుగువారి ఖాళీ భూమి.
నమోదిత విక్రయ దస్తావేజు డాక్యుమెంట్ నం.13433/2015, తేది : 19.11.2015, ఎస్ఆర్ఓ : మహబూబ్‌నగర్.(1413)
జిపిఎస్ కో-ఆర్డినేట్స్ : 16.783091, 78.129317

రిజర్వు ధర : రూ. 2,41,65,000/- బయానా : రూ. 24,16,500/- బిడ్ పెరుగుదల రూ. 2,41,650/-

తేది: 10.10.2024 తదుపరి వివరాలకు సంప్రదించండి: 9000047286

ఇ-వేలం తేది మరియు సమయం: 29.10.2024న మ.12.00 గం. మరియు సా.5.00 గం.ల మధ్య
(10 నిమిషాలు అపరిమిత ఆటో విస్తరణలతో) ఇ-వేలం వెబ్‌సైట్ : https://ebkray.in

బయానా దాఖలుకు ఆఖరు తేది వేలం సమయం వరకు

మొబైల్ నం. మరియు చెల్లుబాటు గల ఇమెయిల్ ఐడి ఉపయోగించి https://ebkray.in లో నమోదు చేసుకోండి. రిజిస్ట్రేషన్ మరియు లాగిన్ మరియు బిడ్డింగ్ రూల్స్ కొరకు https://ebkray.in లోని హోమ్‌పేజీలో ఏర్పాటు చేసిన బయ్యర్ మాన్యువల్ లింక్‌ను దర్శించండి. విచారణ కొరకు సంప్రదించు నంబర్ : 8291220220, ఇమెయిల్ ఐడి : support.ebkray@psballiance.com. బిడ్డర్లు వారి బిడ్లను దాఖలు చేసేముందు మరియు ఇ-వేలం అమ్మకం ప్రొసీడింగ్స్‌లో పాల్గొనే ముందు వేలం అమ్మకం యొక్క సవివరమైన టెండర్ నియమనిబంధనల కొరకు వెబ్‌సైట్ : https://www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx మరియు www.unionbankofindia.co.in చూడవలసిందిగా సూచించబడుచున్నారు. ఈ బిడ్డింగ్ ప్రొసెస్ ముగిసిన తరువాత సఫలీకృత బిడ్డర్‌కు ఇమెయిల్ ద్వారా తెలియజేయబడును. అన్నిటి గల బిడ్డరు సంప్రదించగలరు : అధీకృత అధికారులు, 249/3ఆర్‌టి, 1వ అంతస్తు, మెయిన్‌రోడ్, ఎస్ఆర్ నగర్, హైదరాబాద్-500038, తెలంగాణ. మొబైల్ నం.: 7702398606

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8(6)/రూల్ 9(1) క్రింద చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకం ప్రకటన
పైన తెలిపిన తేదీన ఇ-వేలం అమ్మకం జరుగుట గురించి సదరు రుణం యొక్క రుణగ్రహీతలు మరియు హామీదారులకు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)/ రూల్ 9(1) క్రింద ప్రకటనగా కూడా దీనిని పరిగణించగలరు.

ప్రదేశం: హైదరాబాద్ సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అసెట్ రికవరీ శాఖ






మహిషాసుర మర్దినిగా అమ్మవారు

కొత్తకోట/గోపాల్‌పేట/అమరచింత, అక్టోబరు 11 : వనపర్తి జిల్లాలో శరన్నవరాత్రుల పూజలు భక్తిగా కొనసాగుతున్నాయి. తొమ్మిదో రోజు శుక్రవారం ఆలయాల్లో అలంకరించిన దేవీ విగ్రహాలను భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తకోట పట్టణంలోని భవానీశంకర ఆలయంలోని అంబాభవాని, భక్త మార్కండేయస్వామి దేవాలయంలోని పార్వతీదేవి, కన్యకా పరమేశ్వరి ఆలయంలోని వాసవీమాత, కానాయపల్లి గ్రామం కోటిలింగేశ్వరస్వామి ఆలయంలోని జ్ఞానాంబికాదేవి మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. అలాగే, పట్టణంలోని దండుగడ్డ, పామాపురం, రామకృష్ణాపూర్, పాలెం, కనిమెట్ట గ్రామాల్లో ఏర్పాటుచేసిన మండపాల్లో దేవీ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు ఆయా ఆలయాల నిర్వాహకులు అన్నదానం చేశారు.


కొత్తకోటలోని కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో మహిషాసుర మర్దినిగా దర్శనమిస్తున్న జ్ఞానాంబికాదేవి


గోపాల్‌పేటలోని చెన్నకేశవస్వామి ఆలయంలో మహిషాసుర మర్దినిగా అమ్మవారు

అదేవిధంగా, గోపాల్‌పేటలోని చెన్నకేశవస్వామి ఆలయంలో అమ్మవారు మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేద పండితులు రంగచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మహిళలు పెద్దఎత్తున కుంకుమార్చన నిర్వహించారు.

అమరచింతలోని శివాజీనగర్, విఘ్నేశ్వర భవానీనగర్‌లలో ప్రత్యేక మండపాల్లో వెలిసిన దుర్గామాత, శ్రీకృష్ణనగర్‌లోని కాళికాదేవీ ఆలయంలో అమ్మవారు మహిషాసుర మర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.


అమరచింత శివాజీనగర్‌లో మహిషాసుర మర్దిని అవతారంలో దర్శనమిస్తున్న దుర్గామాత

పలు సమస్యల పరిష్కారం కోరుతూ అదనపు కలెక్టర్‌కు వినతి

వనపర్తి అర్బన్, అక్టోబరు 11 : పట్టణంలో నెలకొన్న పలు సమస్యలపై బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణ సమీపంలోని నల్లచెరువు కట్టపై ఉన్న గ్రిల్స్‌కు కాంగ్రెస్ పార్టీ గుర్తు వచ్చే విధంగా మూడు రంగుల కలర్స్ వేశారని.. పరిశీలించి చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, పట్టణ అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా పట్టణంలో ఫ్లెక్సీల సమస్య, పట్టణం చుట్టు ఉన్న చెరువు కట్టలపై పరిశుభ్రతపై మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, కౌన్సిలర్లు బండారు కృష్ణ, నాగన్నయాదవ్, స్టార్ రహీం, సయ్యద్ జమీల్ తదితరులున్నారు.

జమ్మి పూజకు ఏర్పాట్లు పూర్తి

అమరచింత, అక్టోబరు 11 : దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం సాయంత్రం నిర్వహించే జమ్మి పూజకు మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాట్లను పూర్తి చేశారు. అమరచింత పట్టణంలోని దశమి కట్ట వద్ద జరిగే జమ్మి పూజ కోసం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది అంగరంగ వైభవంగా ఏర్పాట్లు చేశారు. దసరా సందర్భంగా సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు, ఆడపడుచులు రావడంతో గ్రామాలు కళకళలాడుతున్నాయి.

వంట గ్యాస్ సబ్సిడీ పత్రాలు అందజేత

ఆత్మకూరు, అక్టోబరు 11 : రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీ ప్రకారం వంట గ్యాస్ సబ్సిడీ ధ్రువపత్రాలను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మక్తల్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు తులసిరాజ్‌యాదవ్ మహిళలకు అందజేశారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు అందజేసినట్లు మండలంలోని దేవరపల్లి గ్రామంలో మహిళలకు ధ్రువపత్రాలను అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

ఆత్మకూరు, అక్టోబరు 11 : ఆత్మకూరు మునిసిపల్ పారిశుధ్య, నీటి సరఫరా విభాగం కార్మికులకు దుస్తులు, పీపీఈ కిట్లు పంపిణీ చేసినట్లు చైర్‌పర్సన్ గాయత్రి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం కార్మికుల సమావేశం ఏర్పాటు చేసి దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రతీరోజు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచే కార్మికుల సౌకర్యార్థం దుస్తులతో పాటు, కిట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మున్ముందు కూడా పట్టణ పరిశుభ్రతకు, అలాగే తాగునీటి సౌకర్యార్థం కార్మికులు చిత్తశుద్ధితో పని చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ నాగరాజు, కౌన్సిలర్లు అశ్విన్ కుమార్, మండ్ల రామకృష్ణ, యాదమ్మ, మహేశ్వరి, కోఆప్షన్ సభ్యుడు కిషన్‌చంద్‌తో పాటు, కార్మికులు పాల్గొన్నారు.

బాధితులకు సెల్‌ఫోన్లు అందజేత

గోపాల్‌పేట, అక్టోబరు 11 : సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు తిరిగి వాటిని అందించినట్లు ఎస్సై హరిప్రసాద్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన కొమ్ము వెంకటస్వామి, ఏదుట్ల గ్రామానికి చెందిన రంగినేని రవీంద్రరావు రెండు నెలల క్రితం తమ సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నారు. వారు వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసులు వాటిని రాబట్టి బాధితులకు అందించారు. ప్రజలు తమ సెల్‌ఫోన్లు పోగొట్టుకుంటే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి

పాన్‌గల్, అక్టోబరు 11 : గ్రామీణ ప్రాంతాల్లోని యువత క్రీడల్లో రాణించాలని శివారెడ్డి జ్యువెలర్స్ అధినేత, హర్షన్న యువసేన నియోజకవర్గ అధ్యక్షుడు రంగాపురం శివారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రేమద్దుల గ్రామంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు వాలీబాల్ కిట్టు అందజేశారు. కార్యక్రమంలో క్రీడాకారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

ఖిల్లాఘణపురం, అక్టోబరు 11 : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం కాంగ్రెస్ నాయకుడు సాయిచరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్వీఎస్ మెడికల్ కళాశాల వైద్యులు నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన రోగులకు ఎస్వీఎస్ వైద్యుడు డాక్టర్ భరత్‌నందన్‌రెడ్డి పర్యవేక్షణలో సుమారు 35 మంది వైద్యులు, సిబ్బంది కలిసి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పాఠశాల ప్రాంగణంలో యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాగితాల మధు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో పీఏసీఎస్ చైర్మన్ మురళీధర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పెద్దమందడి మండల సమన్వయకర్త తూడి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ క్యామ వెంకటయ్య, పీఏసీఎస్ మాజీ చైర్మన్ వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్యాంసుందర్‌రెడ్డి, రాములునాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్ ప్రజలకు వరం

కొత్తకోట, అక్టోబరు 11 : దేవరకద్ర నియోజకవర్గ ప్రజలకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు వరం లాంటిదని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయేజ్ అన్నారు. శుక్రవారం కొత్తకోటలోని పార్టీ కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు రాములుయాదవ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గంలోని మూసాపేటకు ట్రామాకేర్ సెంటర్, కొత్తకోట మండల కేంద్రానికి 50 పడకల ఆస్పత్రి, దేవరకద్రకు డిగ్రీ కళాశాల మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు నియోజకవర్గ ప్రజల తరుపున వారు ధన్యవాదాలు తెలిపారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ

వీపనగండ్ల, అక్టోబరు 11 : పెరిగిన నిత్యావసరాల ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో మాజీ సర్పంచు ఎం.కృష్ణయ్య అధ్యక్షతన పార్టీ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయని, పెట్రోల్, డీజిల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కేంద్ర కేబినెట్ ఇటీవల ఆమోదించిన ఒకే దేశం.. ఒకే ఎన్నిక భావనను సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. మణిపూర్‌లో 16 నెలలుగా హింస కొనసాగుతుంటే ప్రధాని మోదీ అక్కడికి వెళ్లకపోవడం దారుణమన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న కేంద్ర బీజేపీ ప్రభుత్వ వైఖరిని నవంబరు 15 వరకు సభలు, సమావేశాలు, సదస్సుల ద్వారా ప్రజానీకానికి వివరిస్తూ ఎండగడుతామని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ.జబ్బార్ అన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పుట్ట ఆంజనేయులు, మండల కార్యదర్శి బాల్‌రెడ్డి తదితరులున్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల కవాతు

ఖిల్లాఘణపురం/ఆత్మకూరు, అక్టోబరు 11 : మండల కేంద్రంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కార్యకర్తలు ఆర్‌ఎస్‌ఎస్ సంస్థ ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం గ్రామంలోని వీధుల్లో ప్రధాన రహదారులపై కవాతు నిర్వహించారు. బాలికల ఉన్నత పాఠశాల నుంచి పద్మశాలి కల్యాణ మండపం వరకు ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు కవాతుగా వెళ్తుండగా గ్రామస్థులు పూలవర్షం కురిపించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో భారత మాత చిత్రపటాన్ని ఊరేగించారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పాలమూరు విభాగ్ కార్యవర్గ నిర్వాహకుడు పత్తికొండ రాము మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అదేవిధంగా, ఆత్మకూరులో స్వయం సేవకుల పద సంచాలన్ జరిగిన అనంతరం గ్రామీణ వికాస పరిషత్ జిల్లా బాధ్యుడు పల్లె శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఖండ కార్యవహ లింగన్న, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు నరసింహారెడ్డి, మ్యడం శ్రీను, భగవంతురెడ్డి, తపస్ నాయకులు ఉమాశంకర్, శాంతన్న, విశ్వహిందూ పరిషత్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

హామీలకే పరిమితమైన కాంగ్రెస్ ప్రభుత్వం

» బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ

వనపర్తి రూరల్, అక్టోబరు 11 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీలకే పరిమితం అయిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ అన్నారు. శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో వనపర్తి మండలం కిష్టగిరి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బీజేపీలో చేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో సభ్యత్వ నమోదు అసెంబ్లీ సమన్వయకర్త మున్నూరు రవీందర్, ప్రధాన కార్యదర్శి అక్కల రామన్‌గౌడ్, జిల్లా కోశాధికారి బాశెట్టి శ్రీను, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జి పెద్దిరాజు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గంధం ప్రవీణ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఫలితాల్లో జిల్లా సెకండ్ ర్యాంకర్‌కు సన్మానం


దేవను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మదనాపురం, అక్టోబరు 11 : ఇటీవల విడుదలైన ఉపాధ్యాయ ఫలితాల్లో మదనాపురం మండలంలోని నర్సింగాపురం గ్రామానికి చెందిన బడుగుల దేవ స్కూల్ అసిస్టెంట్ సోషల్ సబ్జెక్టులో వనపర్తి జిల్లా స్థాయి రెండవ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా శుక్రవారం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దేవను శాలువాతో సన్మానించి, అభినందించారు. ఆయన వెంట జడ్పీటీసీ మాజీ సభ్యుడు కృష్ణయ్య యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు బిట్ల యాదగిరి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, విండో వైస్ చైర్మన్ చీర్ల శ్రీనివాసులు, బీఆర్‌ఎస్ మండల యూత్ ప్రెసిడెంట్ రాజ్‌కుమార్, మాజీ సర్పంచులు రాంనారాయణ, విజయేందర్‌రెడ్డి, కోట్ల తిరుపతయ్య, ఆంజనేయులు, శివశంకర్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, బాలకృష్ణ, కుమార్ తదితరులున్నారు.

దుకాణాల ఎంపిక పారదర్శకంగా ఉండాలి

» ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి టౌన్, అక్టోబరు 11 : వనపర్తి పాత మార్కెట్ యార్డులో నిర్మించిన సమీకృత మార్కెట్ సముదాయ దుకాణాల ఎంపిక పారదర్శకంగా ఉండాలని, ఇందులో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అధికారులకు సూచించారు. డిప్ ద్వారా చేపట్టిన లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమానికి ఎమ్మెల్యే, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీహెచ్‌సీ కేటగిరీ ప్రకారం ప్రతీ ఒక్కరికి లబ్ధి చేకూరాలని, ఇందులో ఎలాంటి పొరపాటు జరగకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ఎంపికైన లబ్ధిదారుల వివరాలను కేటగిరీల వారీగా ప్రజలందరికీ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. మార్కెట్ యార్డు చైర్మన్ బండారి శ్రీనివాస్‌గౌడ్, వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మార్కెట్ యార్డు జిల్లా అధికారి స్వరణ్‌జిత్‌సింగ్, టెలికాం బోర్డు మెంబర్ శంకర్‌ప్రసాద్, మార్కెట్ యార్డు డైరెక్టర్లు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


అదనపు కలెక్టర్, మార్కెట్ యార్డు అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

» కలెక్టర్ ఆదర్శ్ సురభి

కొత్తకోట, అక్టోబరు 11 : పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే విష జ్వరాలు దరి చేరవని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. శుక్రవారం మండలంలోని కానాయపల్లి గ్రామంలో డెంగీ బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం కాలనీ ప్రజలతో మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో చెత్తాచెదారంతో పాటు, డబ్బాలు, పాత కుండలు, పైపులు, కూలర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అలాగే మురికినీరు ప్రవహిస్తున్న కాలనీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి సాయంత్రం వేళ ఫాగింగ్ చేయించాలని గ్రామ కార్యదర్శిని ఆదేశించారు. డ్రైనేజీల నిర్మాణం చేయకపోవడంతో మురుగు ముందుకు పోవడం లేదని.. తాత్కాలికంగా మరమ్మతులు చేయడానికి చర్యలు తీసుకోవాలని గ్రామ నాయకులు గోకరయ్య, సిద్ధయ్య కలెక్టర్‌ను కోరారు. అనంతరం కొత్తకోటలోని పీహెచ్‌సీని పరిశీలించి, వసతులపై డాక్టర్ ఆసియాబేగంతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అంతకుముందు గుంపుగట్టు సమీపంలో ఆసుపత్రి నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో చెన్నమ్మ, మునిసిపల్ చైర్‌పర్సన్ సుకేశిని ఉన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పాన్‌గల్/వీపనగండ్ల/ఆత్మకూరు/పెబ్బేరు రూరల్ : గ్రామాల్లో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పాన్‌గల్ మండల ప్రాథమిక వైద్యాధికారి చంద్రశేఖర్ అన్నారు. డ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంతో పాటు, కదిరేపాడు గ్రామంలో ఆయన పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. నిల్వ నీటిని పరిశీలించి వాటిని పారబోశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శాంతమ్మ, హెల్త్ అసిస్టెంట్లు రాంచందర్, మదన్‌గోపాల్, జయలక్ష్మి, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవిధంగా, వీపనగండ్ల మండలం కల్వరాల గ్రామంలో డ్రైడే డ్రైడేలో భాగంగా పీహెచ్‌సీ డాక్టర్ రాజశేఖర్ ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఏఎన్‌ఎం సుజాత, అంగన్‌వాడీ టీచర్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. ఆత్మకూరు పట్టణంలోని ఆరవ వార్డులో పరిసరాల పరిశుభ్రతపై మునిసిపల్ చైర్‌పర్సన్ గాయత్రి కాలనీవాసులకు అవగాహన కల్పించారు. కమిషనర్ నాగరాజు, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్, మునిసిపల్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, ఆర్‌పీలు పాల్గొన్నారు. పెబ్బేరు మండలంలోని రంగాపురం గ్రామంలో డీఆర్‌డీఏ పీడీ నాగేందర్ డ్రైడే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటి ముందున్న నీటి సంపులు, చుట్టుపక్కల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. డాక్టర్ వినీల, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


కానాయపల్లి గ్రామంలో డెంగీ బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి


కదిరేపాడులో నిల్వ నీటిని పారబోస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

దృఢ సంకల్పంతో లక్ష్యాలు సాధించాలి

» అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, అక్టోబరు 11 : బాలికలు దృఢ సంకల్పంతో లక్ష్యాలు సాధించాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ సూచించారు. శుక్రవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వనపర్తి పట్టణంలోని బాలసదన్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ హాజరై మాట్లాడారు. బాలికలు సమాజంలో సాధికారత సాధించడానికి ప్రభుత్వం ద్వారా అన్ని అవకాశాలు కల్పిస్తామన్నారు. చదువులో, ఉద్యోగ విషయంలో బాలికలకు ప్రభుత్వం పుష్కలంగా అవకాశాలు కల్పిస్తోందన్నారు. బస్సులో సైతం ఉచిత ప్రయాణం కల్పించిందని పేర్కొన్నారు. బాలికలు ఉన్నత లక్ష్యాలతో చదువుకొని అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. సాధికారత సాధించేందుకు చదువు ఒక్కటే మార్గమని.. ప్రభుత్వం బాలికలకు కల్పిస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి లక్ష్మమ్మ, జిల్లా పౌర సంబంధాల అధికారి సీతారం, సీడబ్ల్యూసీ మెంబర్స్ వనజ, విష్ణు, విజయ్, డీసీపీవో రాంబాబు, డీఎంసీ భాస్కర్, జెండర్ స్పెషలిస్టు శ్రీవాణి, సలోమి, ఫైనాన్స్ స్పెషలిస్టు సుమ, ప్రమీల, రాజు , పురుషోత్తం, చిల్డ్రన్ హోమ్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, కౌన్సిలర్ సంతోషి, సైదమ్మ, జ్యోతి తదితరులున్నారు.


బాలసదనం విద్యార్థులతో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్





ఆడపిల్ల ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ

పాన్‌గల్/అమరచింత, అక్టోబరు 11 : ఆడపిల్ల ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని ఐద్వా జిల్లా కార్యదర్శి లక్ష్మి అన్నారు. శుక్రవారం పాన్‌గల్ మండలం రేమద్దుల గ్రామంలో ఐద్వా సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సృష్టికి మూలమైన మహిళను అగ్రభాగాన నిలిపేదే బతుకమ్మ అని బతుకమ్మ అంటేనే మహిళల పండుగ అని గుర్తు చేశారు. ఆడపిల్లను పుట్టనిద్దాం.. బతుకనిద్దాం.. చదివిద్దాం అంటూ జరుపుకునే పండుగ అన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు గద్వాల సాయిలీల, పద్మ, శివలీల, ఇందిరమ్మ, అంజనమ్మ, తేజ, బాలకృష్ణమ్మ, రేణుక, జయమ్మ తదితరులున్నారు. అదేవిధంగా, అమరచింత పట్టణంలోని రాంనగర్ దశమి కట్ట వద్ద శుక్రవారం రాత్రి నిర్వహించిన సద్దుల బతుకమ్మ కార్యక్రమం అంగరంగ వైభవంగా కొనసాగింది. ఈ సందర్భంగా రంగురంగుల పూలతో అలంకరించి పెద్ద ఎత్తున మహిళలు వాడవాడ నుంచి దశమి కట్ట వద్దకు ర్యాలీగా బతుకమ్మలతో వచ్చారు. వరుస క్రమంలో పేర్చిన బతుకమ్మకలకు బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి సంబురాలను ప్రారంభించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో బతుకమ్మ చుట్టు ఆడుతూ భక్తిని చాటుకున్నారు. మధ్యరాత్రి వరకు సంబురాలు జరిగాయి.


అమరచింతలో బతుకమ్మలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు


రేమద్దులలో బతుకమ్మ సంబరాల్లో ఐద్వా మహిళ సంఘం సభ్యులు

మిర్చి గిర్నీకి భలే గిరాకీ



దసరా అంటేనే మాంసాహారానికి ప్రాధాన్యతనిస్తుంటారు మాంసాహార ప్రియులు. ఈ వంటకాల్లో కారం చాలా ముఖ్యం. కారం కొనాలన్నా, ఎండుమిర్చి కోసం జిల్లా కేంద్రంలోని పాత యూకో బ్యాంకు సమీప ప్రాంతానికి జిల్లా ప్రజలతో పాటు, పరిసర గ్రామాల ప్రజలు ఇక్కడికి వస్తుంటారు. కారం కొట్టే గిర్నీల వద్ద ఉప్పును ఎండలో ఆరబెడుతూ ఎండుమిర్చి తొడిమెలు తీస్తున్న వారితో సందడిగా కన్పించిన ఈ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి జిల్లా

